
# ఆ పుస్తకం...

పసుపులేటి సుధాకర్



లచ్చి ఆ పుస్తకానికి రెండు వైపుల వున్న రంగు రంగుల అట్టల్ని చింపివేసింది కసిగా ఎదురుగా కిరసనాయలుదీపం మండుతోంది మగతగా. ఆ పుస్తకంలోని ఒక్కొక్కపేజి చించి అగ్నికి ఆహూతి చేస్తోంది. అన్ని పేజీలు పూర్తిగా మసిబుగ్గయి వాయి. ఇంతకుక్రితం చింపివేసిన అట్టల్ని ముక్కలు చేసి దీపంముందు పెట్టింది— ఎందుకో అవి అంటుకోలేదు సరిగ్గా. వాటిని చిన్న చిన్న ముక్కలుగా చింపి విసిరివేసింది అవి సరిగ్గా ఇంటి ముంగిట పడ్డాయి.

* * *

లచ్చికి పదిహేనేళ్ళు ఉంటాయి. లచ్చి పోలయ్యకు ఒక్కగా నొక్క కూతురు. పోలయ్య ఆ పల్లెలో గొర్రెలు, మేకలు మేపుతుంటాడు. లచ్చిఅంటే పోలయ్యకు ప్రాణం. మీనాల్లాంటి కళ్ళు, సంపెంగ పువ్వుల్లాంటి ముక్కు గట్రా లేకపోయినా, అమాయకమైన ముఖంలో ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ ఉంటుంది. ఉదయం ఏడు గంటలకే పోలయ్య గొర్రెల్ని, మేకల్ని మందకు తోలుకొని వెళ్ళింతర్వాత లచ్చితల్లి గౌరమ్మ వంటా అదీ చేసి తను కూలికి పోతుంది. సూర్యుడు నడి నెత్తికి రాకముసుపె తల్లికి, తండ్రికి భోజనం తీసుకొని బయలుదేరుతుంది. తర్వాత రాగానే తనతోటి అమ్మాయిల్తో ఏదో కబుర్లు చెప్పుకొంటూ కాలం వెళ్ళబుచ్చుతుంది.

ఆరోజు, ఆ పల్లెలో చాల హడావిడిగా ఉంది. వూరి మధ్యభాగంలో ఇన్ని రోజులు చావిడిలావున్న ఇంటికి మామిడాకులు, రంగు కాగితాలు అవి కట్టారు రెండు జీపులు అక్కడ నిలబడి ఉన్నాయి. ఎవరెవరో సూటు బూటు వేసుకొన్న మనుషులు ఏదో ఇంగ్లీషులో మాట్లాడేస్తున్నారు ఎవరో తీగలా నాజూగ్గా ఉన్న ఓ అమ్మాయి చావిడిలోపల కరణంతో మాట్లాడుతోంది. తల్లికి, తండ్రికి భోజనం ఇచ్చి రాగానే లచ్చి చూసింది. ఏదో బోర్డు తెచ్చి కట్టారు, ఆ ఇంటిముందు. లచ్చి ప్రక్కనే ఉన్న రామితో 'రామి? ఏమిటే ఆ సంబరం? ఎవరు వాళ్ళు?' అని అడిగింది 'మరి, మనవూళ్ళో బడి పెడుతున్నారట. ఈరోజునుంచే మొదలుట. అదో సన్నగాఉండే అమ్మాయిగారే మేష్టరమ్మట' అంది రామి. కాస్సేపటికి కరణం, మునసబు, ఆ సూటు బూటు వేసుకొన్న ఆయన ఏవో మాట్లాడారు. ఆతర్వాత మేష్టరమ్మ పిల్లలందరికి మిఠాయిలు పంచింది. కాస్సేపు తర్వాత అందరు జీపుల్లో ఎక్కి, మేష్టరమ్మను అక్కడే వదలి వెళ్ళిపోయారు. లచ్చికి సాయంత్రం తల్లి తండ్రి వచ్చేవేళ అయింది. ఇంటికి వెళ్ళిపోయింది. ఇంట్లో నులకమంచంమీద కూర్చొంది. ఏదో ఆలోచిస్తోంది. తనెందుకు ఇలా ఉంది? ఆ పంతులమ్మ ఎంత అందంగా చలాకీగా ఉంది. ఆమె ముఖం చూస్తుంటే ఎంత అందంగా ఉంది. మరి చదువుకున్న వాళ్ళందరు అలాగే ఉంటారేమో? మరి తను చదువు నేర్చుకొంటే? ఊహూ? మరి ఇంత వయస్సులో బడి కెళితే నవ్వరూ? ఇంతముందు తను ఎన్నో మార్లు చూసింది, కరణంగారి అమ్మాయి పట్నంలో చదువుతోంది. అప్పుడప్పుడు సెలవులకని వూరు వస్తుంటుంది. మరి ఎంత నాజుగ్గా అచ్చం పంతులమ్మలాగే ఉంది ఒకసారి ఆ అమ్మాయి తను ఆరోజు కసువు చెక్కను వెళ్ళితే అక్కడ చెట్టునీడన కూర్చొని ఏదో రంగు రంగుల అట్టవున్న ఓ లావుపాటి పుస్తకం చదువుతోంది. తను కూడా ఆ బొమ్మల పుస్తకం చూసింది. ఎంత బావుందని? చదువుతూ ఎంత బావుంటుందో? మరి తనకు చదువు రాదుగా? మరి వచ్చిఉంటే, అడిగితే ఆ అమ్మాయి ఇచ్చిఉండేదేమో? ఆలోచిస్తూవుంటే చిన్నగా కునుకు వచ్చేసింది లచ్చికి! గౌరమ్మ అప్పుడే వచ్చింది కూలినుంచి లచ్చి పడుకొని ఉండటం చూచి 'ఏమ్? లచ్చి! ఏమిటా నిద్ర సాయంత్ర పూట?' అంది. కళ్ళు నులుముకుంటూ లేచింది లచ్చి.

* * *

లచ్చికి చదువుకోవాలన్న ఆకాంక్ష ఎక్కువైపోయింది. కట్ట కడపటికి ఓ నిర్ణయానికి వచ్చింది. పంతులమ్మని అడగాలి, ఇంటికివెళ్ళి వీలుంటే తనకు సాయంత్రంపూట ఇంట్లో • చదువు నేర్ప

నొక్కుల నొక్కుల జుట్టుతో, చలాకీగాఉండే శేఖర్ ఎక్కడ? నల్లటి మొద్దు శరీరం, ఒక్క అక్షరం ముక్కరాని, నొక్కుల నొక్కుల జుట్టు లేక పోయె కనీసం క్రాపు అయినా లేక గంటు వేసుకొనే తన భర్త రాజయ్య ఎక్కడ? నక్కెక్కడ నాగ లోక మెక్కడ? అసలుకు ఎప్పుడైనా శేఖర్ లతతో మాట్లాడినట్టు ఇష్టంగా తనతో రాజయ్య మాట్లా డాడా? తనకేమి? తను ఎంతో అందంగా ఉంది. ఈ పల్లెలో ఈ రాజయ్య పెళ్లాం అయిందికాని అదే పట్నంలో ఉంటే ఎంత అందంగా అలంకరణ చేసుకొంటే ఆ లతకు తనకు భేదముంటుందా? తన తల్లి కూడా అప్పుడప్పుడు అంటుండేది 'లచ్చి? నీవు నిజంగా ఏదో కర్మ చాలక నా కడుపున పుట్టావు. నీవు ఏ మహారాజుల ఇంట్లోనో పుట్టాల్సింది నీ అందానికి' అని ఔను తను పలమనేరుకు ఎప్పు డైనా సినిమాకు వెళ్ళినప్పుడు వూర్లోవున్న అబ్బా యిలు తనను ఎంత ఇదిగా చూసేవారు? తన అందంచూసి కాబోలు వాళ్ళు అలా చూసి ఉంటారు. ఉన్నట్లుండి మళ్ళీ రాజయ్యమీద పోయింది ఆలో చన. రాజయ్యమీద విపరీతమైన ద్వేషం పుట్టింది. ఎంతో జుగుప్స కలిగింది అతనంటే. రాజయ్య తనకు ఏవిధంగానైనా భర్తగా సరిపోడు. ఒక

# ఆపస్తకం

అందమా? చదువా ? ఒక ఇష్టమైన మాట మాట్లాడుతాడా? నిజంగా రాజయ్య తన భర్తగా అనర్హుడు. ఈ ఆలోచనలతో ఇక చదవలేకపోయింది. దీపంముందునుంచి లేచి రాజయ్య మంచంవైపు చూసింది. నిద్ర పోతున్నాడు. దీపం ఆర్పి తన మంచంమీద పడుకొంది. పడుకొన్నా ఇదే ఆలోచ నలే! మనస్సంతా కలతబారిపోయింది. రాజయ్య తన భర్తగా సరిపోడు అని తన అంతరాత్మ అరచి చెబుతున్నట్లుంది. శేఖర్‌లాంటి భర్త కావాలి. ఈ ఆలోచనలతో నిద్ర రాలేదు పైగా దుఃఖం వస్తోంది. తలగడంతా కన్నీటితో తడిచిపోయింది. ఏ తెల్లవారిజామునో నిద్ర పట్టింది. అందులో కూడా కలలే. తను శేఖర్ కారులో షికారు వెడు తున్నట్లు, దోవలో రాజయ్య తన నల్లటి మొరట శరీరంతో తమ వైపు చూస్తుంటే తను అసహ్యంగా అతనివైపు చూసి కారు ఇంకా స్పీడుగా వదలినట్లు. ఇంకా ఏవేవో కలలు వచ్చాయి.

* * *

ఉదయం లచ్చి లేచేసరికి బారెడు ప్రొద్దు ఎక్కిపోయింది. రాజయ్య ఎప్పుడో పొలానికి వెళ్ళి పోయాడు. పన్నెండు గంటల కంతా తను భోజనం తీసుకొని వెళ్లాలి పొలానికి. అయిష్టంగానే వంట ప్రారంభించింది. నిన్నటిరోజు రాజయ్య సరదాగా గారెలు చెయ్యమంటే, రేపు చేద్దామంది. కాని ఈరోజు చెయ్యడానిక్కి ఇష్టంలేదు. రాజయ్యను తల్చుకొంటే తన గుండెల్లో ఎవరో బలమైన కమ్మీతో పొడిచినట్లవుతుంది. రాజయ్య తనకు తగిన భర్త కాదు అని వేయి కంఠాలు తన చుట్టూ మూగి అరుస్తున్నట్లు అవుతుంది. అన్నం, చారు చేసి, గంపలో పెట్టుకొని పొలానికి బయలు దేరింది. చెట్టుక్రింద గంప పెట్టి కునుకు చెక్కసాగింది. ఇంతక్రితం వెళ్ళినప్పుడల్లా రాజయ్య ఏంపని చేస్తున్నా దాన్ని అప్పటికి విడిచిపెట్టేట్లు చేసి భోజనానికి రమ్మనేది. ప్రక్కలో కూర్చుని కంచంలో అన్నం కూరలు వడ్డించి కబుర్లు చెబుతూ కొసరి కొసరి తినిపించేది. కాని, ఆరోజు అసలు మొఖం చూడ్డానికే ఇష్టంలేదు. రాజయ్యే కాస్సేపటికి వచ్చి అన్నం తిని ఏదో పని ఎక్కువ ఉన్నందువల్ల వెళ్ళిపోయాడు మళ్లీ పొలంలోకి. లచ్చి భర్తతో ఒకమాటైనా మాట్లాడకుండ గంప తీసుకొని ఇంటికి వెళ్ళిపోయింది. ఇంటి కొస్తే మరే ఆలోచన లేదు. ఒకటే ఆలోచన, రాజయ్య తనకు తగిన భర్త కాదు అనే. ఆలోచించి ఆలోచించి విపరీతమైన తలనొప్పి వచ్చే సింది లచ్చికి. తల పగిలిపోయేలా ఉంది. వేయి సమ్మెటలతో ఒక్కసారి తలమీద మోదినట్లుంది. మంచంమీద పడుకునేసింది. మగతగా నిద్ర కూడా పట్టేసింది. సాయంకాలం అయింది. ఎవరివో చేతులు తన నొసటిమీద పడినట్లయింది లచ్చికి. కళ్ళు తెరచి చూస్తే రాజయ్య. పురుగును విది లించినట్లు విదిల్చేసింది రాజయ్య చేతిని. రాజయ్య 'లచ్చి! అరే వేడిగా ఉందే? జ్వరం వచ్చిందా ?' అని అడిగాడు. లచ్చి ఏమి సమాధానం చెప్ప లేదు. నిద్రనుండి మేల్కొనగానే తలనొప్పి మరీ ఎక్కువైంది. తలనొప్పికి తాళలేక అమ్మా! అబ్బా! అంటూ మూలగసాగింది. ఇక రాజయ్య ఉండలేకపోయాడు. లచ్చి పడుతున్న బాధ చూసి అతని హృదయం కత్తులతో కోస్తున్నట్లుంది. వెంటనే రామారావుగారి దగ్గరకు పరుగెత్తాడు. రామారావు ఆ వూర్లో ఉన్న రూరల్ డిస్పెన్స రీలో డాక్టరు. యువకుడు. వైద్యవిద్య నభ్యసించి అమాయక గ్రామీణులకు సేవ చేయాలని పల్లె ప్రాంతానికే వేయించుకొన్నాడు. రాజయ్య, రామా రావును వెంటబెట్టుకొచ్చాడు. రామారావు లచ్చిని పరీక్షించి తన మెడికల్ బ్యాగ్ నుండి మూడు మాత్రలిచ్చి ఇప్పు డొకటి రేపు తెల్లవారి, మళ్లీ మధ్యాహ్నానికి రెండు అన్ని చెప్పాడు. జావ మాత్రం ఇవ్వమన్నాడు. రాజయ్యకు మనస్సు తృప్తి కాలేదు. 'అయ్యగారూ ? ఈ జ్వరం ఇక్కడే తగ్గుతుందంటారా ? లేక పలమనేరు తీసుకెళ దామా ? చెప్పండి ? అది మూలుగుతుంటే నాకు చాలా భయంగా ఉంది' అన్నాడు రాజయ్య. రామారావు నవ్వుతూ 'రాజయ్యా ? ఏం ప్రేమోయ్ నీకు పెళ్ళాంమీద ? ఏదో కాస్త వొళ్ళు అలా వెచ్చ బడేసరికి పలమనేరు తీసుకెళుతానా, వేలూరు తీసుకెళుతునా అంటున్నావ్ ? నిజంగా నీ భార్య



యజమాని: ఏమయ్యా! నిన్న పోసిన పాలు చేదుగా ఉన్నవేమిటి ?
పాలాయన: ఒకవేళ ఆవు వేపాకు ఏమైనా తినిందేమో! అందుకని చేదుగా ఉండొచ్చును.

లచ్చి అదృష్టవంతురాలు. నీలాంటి ప్రేమ గల భర్త దొరికినందుకు. మరి, ఏం భయపడవద్దు. తెల్లవారికి హాస్పిటలుకు రా, మందు ఇస్తాను. అన్నట్లు, రేపంతా జావే ఇవ్వు, అన్నం అదీ తిన నివ్వకు, సరేనా ?' అంటూ 'ఇక వెళతాను' అంటూ లేచాడు. రాజయ్య మెడికల్ బ్యాగ్ తీసుకొని రామారావును ఇంట్లో విడచి రావడానికి డాక్టరుతో వెళ్లాడు.

లచ్చి డాక్టరు చెప్పిన మాటలన్నీ విన్నది. ఒక్కసారి తెలివొచ్చినట్లయింది. మళ్ళీ గతాన్నంతా ఆలోచించసాగింది. ఔను డాక్టరుగారు చెప్పినట్లు తన భర్త ఎంత మంచివాడు. తన భర్త తనను ఎంత ఆప్యాయంగా చూసుకొనేవాడో జ్ఞాపకం వచ్చింది. తను ఏమి అడిగినా నిమిషాలమీద తెచ్చి ఇచ్చేవాడే తన భర్త — అసలుకు ఈరోజు ఏదో ఒళ్ళు అలా వెచ్చబడేసరికి ఎంత ఆదుర్దా పడిపోయాడు. అలాంటి తన భర్తనా తను ద్వేషించింది. అలాంటి తన భర్తనా తను అసహ్యించుకొన్నది. తల్చుకొంటే తనకే సిగ్గవుతోంది. తన భర్త నిజంగా దేవుడులాంటివాడు. అంతలో రాజయ్య వచ్చాడు. వచ్చి 'ఎలా వుంది లచ్చి' అని అడిగాడు. లచ్చి గొంతు గాద్గదికం అయింది. ఏమి జవాబు చెప్పలేకపోయింది. రాజయ్య జావ కాచడానికి పొయ్యి రగిలించసాగాడు. పొగ కండ్లలో పోయి కళ్ళలో నీళ్ళు కారుతున్నాయి రాజయ్యకు. అప్పుడప్పుడు తనవైపు చూస్తున్నాడు. జావ కాచి లచ్చికి ఇచ్చాడు. ఏమి అనకుండా తాగేసింది. రాజయ్య లచ్చి మంచం ప్రక్కన కూర్చున్నాడు. రాజయ్య అన్నం తినలేదు. అసలుకు భోజనం వండుకోలేదు.

లచ్చి 'మావా ! ఇంకా అన్నం చేసుకోలేదా?' అంది. రాజయ్య బాధగా 'లచ్చి ! నీవిలా జ్వరంతో తలనొప్పితో బాధపడుతుంటే నా కెలా సహిస్తుంది అన్నం ?' అన్నాడు. లచ్చి బలవంతంమీద అన్నం చేసుకొని గుజ్జు కలుపుకొని భోజనంచేసి మళ్ళీ లచ్చి ప్రక్కన కూర్చున్నాడు.

'లచ్చి ! నీకు జ్వరం బాగ కాగానే ఓ నాలుగైదు రోజులు పొలం దగ్గర కొచ్చి ఒళ్ళు అలుసుకోకు. అన్నీ నేనే చేస్తాను సరేనా ?' అన్నాడు రాజయ్య. రాజయ్య మాటలు విని లచ్చి పొంగిపోయింది. ప్రాణానికి ప్రాణమిచ్చే భర్త తనకున్నాడు. లచ్చికి హృదయమంతా రాజయ్యమీద అనురాగంతో నిండిపోయింది. లచ్చి రాజయ్యతో కాస్సేపటికి 'మావా తలనొప్పి తగ్గిందిలే నీవు పడుకో' అంది. రాజయ్య తన మంచంమీద పడుకొన్నాడు. కాస్సేపటికి రాజయ్య నిద్రలో కూడా లచ్చికి త్వరగా జ్వరం బాగా కావాలని కోరుకుంటున్నాడేమో. మెల్లగా లేచింది లచ్చి. పుస్తకాన్ని చింపి ఒక్కొక్క పేజీ కాల్చివేసింది. అన్ని పేజీలు కాల్చి, అట్టలు కాలకుండా ఉంటే చింపి ఇంటి ముంగిట పారవేసింది.

తెల్లవారి రాజయ్య లేచి బయట పడిఉన్న అట్ట ముక్కలు, కాగితాల బూడిద చూశాడు. ఏవీ అర్థంకాలేదు. లచ్చి మంచంవైపు చూశాడు. ప్రశాంతంగా నిద్రపోతోంది. చూసి తృప్తిగా నిట్టూర్చాడు. పొయ్యి రాజెయ్యసాగాడు త్వర త్వరగా, నిద్రనుండి లేవగానే లచ్చికి జావకాచి ఇవ్వాలని. ★




# పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్ని, మీ సరియైన చర్యను గురించిన్ని మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టముగా పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళవివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ మొదలుకొని 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములలో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, ఆకస్మిక ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు.1,25న. పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం). దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTHISHI (A.W.P)
P. B. 86, JULLUNDUR CITY.

"ఓవోమాల్ట్ నా నృత్యానికి దోహద మిస్తోంది" అని అంటోంది పద్మిని

ఓవోమాల్ట్ సత్తువను, ఆరోగ్యాన్ని ప్రసాదించే బార్లీమాల్ట్-ఎక్స్ట్రాక్ట్ అప్పటమైన పాలు, విటమిన్లు మరియు కోకోలతో తయారై కమ్మని సువాసనతో, పోషక పదార్థాలతో, సులభంగా జీర్ణమవుతుంది.

సరిక్రొత్త పుష్టికరమైన గ్రానులర్

ఓవోమాల్ట్

సాటిలేని ఆహార పానీయం.




ఫుడ్స్ ఫ్యాట్స్ & ఫర్టిలైజర్స్
ప్రైవేట్ లిమిటెడ్,
తాడేపల్లిగూడెం - మద్రాసు - బొంబాయి

EP-FFP-8